VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers


# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 299

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 15 ఏప్రిల్ 2026


# క్వాంటం టెక్నాలజీకి అమరావతి లాంచ్ పాడ్

- దేశంలో తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల ఆవిష్కరణ • 45 లక్షల మందికి క్వాంటం, ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ • క్వాంటం మౌలిక సదుపాయాలతో రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణం
- ఔషధాల నుంచి క్రయోజెనిక్స్ వరకూ పరిశోధనలకు కేంద్రంగా క్వాంటం వ్యాలీ • ఎస్ఆర్ఎం, మేధాటవర్స్‌లోని 1 ఎస్, 1క్యూ క్వాంటం టెస్ట్‌బెడ్‌లను జాతికి అంకితం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి,కలంకౌంటర్ :** ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో ఓ సరికొత్త టెక్ అధ్యాయం ప్రారంభమైంది. దేశంలోనే తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ ఆవిష్కృతమైంది. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, గన్నవరంలోని మేధా టవర్స్ వద్ద ఏర్పాటు చేసిన 1 ఎస్, 1 క్యూ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. క్వాంటం టెక్నాలజీకి అమరావతిని లాంచ్ పాడ్‌గా మారుస్తామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలను ప్రారంభించిన అనంతరం క్వాంటం రంగ నిపుణులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.."ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత మొట్టమొదటి క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీని ప్రారంభించటం సంతోషంగా ఉంది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 1ఎస్ ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీ, మేధాటవర్స్‌లో 1 క్యూ పేరిట మరో క్వాంటం సిస్టం ఏర్పాటు చేశారు. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు, ప్రజలకు శుభాకాంక్షలు తెలియ చేస్తున్నాను. క్వాంటం సైన్స్ వంద ఏళ్లు పూర్తైన సందర్భంగా ప్రపంచ క్వాంటం దినోత్సవం రోజున దీన్ని సాకారం చేసుకుని చరిత్ర సృష్టించాం. విజ్ఞానమే సామాజిక ప్రగతికి చిహ్నం అని చెప్పిన అంబేద్కర్ గారి జయంతిని పురస్కరించుకుని అమరావతిలో క్వాంటం కంప్యూటర్ రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభించుకున్నాం. క్వాంటం టెక్నాలజీని పరిశోధకులకు, కంపెనీలకు, విద్యార్థులకు అందుబాటులో ఉంచేలా ఈ టెస్ట్ బెడ్‌లను ఏర్పాటు చేయటంపై అందరికీ అభినందనలు. భారత తొలి ఓపెన్-







యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీలతో పాటు అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు ప్రోత్సహిస్తోన్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు. ఏక్యూవీ ని వేగంగా పూర్తి చేయటంలో సహకరిస్తున్న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, కార్యదర్శి అభయ్ కరాండికర్‌కు ధన్యవాదాలు. అమరావతిలో ప్రారంభమైన 1ఎస్ ,1 క్యూ క్వాంటం హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్స్ క్వాంటం ఉపకరణాలను పరీక్షించడానికి, సర్టిఫై చేయడానికి కీలకం. దేశంలోని తొలి క్వాంటం కంప్యూటర్లకు ఆంధ్రప్రదేశ్ వేదిక అయినందుకు గర్విస్తున్నాను. ఐటీ రంగంలో కీలక పాత్ర పోషించిన తెలుగు గడ్డ ఇప్పుడు క్వాంటం టెక్నాలజీకి వేదికగా మారటం సంతోషదాయకం" అని ముఖ్యమంత్రి అన్నారు.

**క్వాంటం రంగంలో ఆత్మనిర్భర్‌గా ఆంధ్రప్రదేశ్..** "పారిశ్రామిక రంగానికి విద్యుత్ కీలకం, డిజిటల్ యుగానికి ఇంటర్నెట్ అంతే ముఖ్యం, ఆధునిక ఆవిష్కరణలకు క్వాంటం టెక్నాలజీ ప్రధానం. క్వాంటం సాంకేతికతలో సాధికారిత సాధించిన దేశాలే భవిష్యత్తును శాసించే అవకాశం ఉంటుంది. భారతీయ పరిశోధకులకు క్వాంటం హార్డ్‌వేర్ పరీక్షించేందుకు అమరావతి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ ప్రధాన కేంద్రం అవుతుంది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని అమరావతి 1 ఎస్ కంప్యూటర్ పరిశోధనలకు, మేధా టవర్స్‌లోని అమరావతి 1క్యూ కంప్యూటర్ పారిశ్రామిక వినియోగానికి తోడ్పడతాయి. అమరావతిలో ఏర్పాటైన ఈ రెండూ టెస్ట్ ఫెసిలిటీలు క్వాంటం టెక్నాలజీలో దేశ సామర్థ్యాన్ని పెంచాయి. కేవలం 8 నెలల్లోనే క్వాంటం కంప్యూటింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలు వాస్తవ రూపం దాల్చాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో క్వాంటం కంప్యూటర్లను నిర్మించాలని నేను ఇచ్చిన సూచనల మేరకు ఇవి ఏర్పాటయ్యాయి. దేశానికి, ప్రపంచానికి కావాల్సిన క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు కూడా ఇక్కడే తయారు చేసేలా కార్యాచరణ చేపట్టాం. ముంబైలోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, పూణెలోని డీఆర్డీఓ సహా వివిధ సంస్థల భాగస్వామ్యంతో స్వదేశీ టెక్నాలజీతోనే ఈ క్వాంటం టెస్ట్ బెడ్‌లు సిద్ధమయ్యాయి. ఇక వ్యూహాత్మక టెక్నాలజీల్లో భారత్ ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం లేదని భావిస్తున్నాను. దేశీయంగానే క్వాంటం ఉపకరణాలు తయారు చేయటం ఆత్మనిర్భర్ కార్యక్రమంలో కీలకమైన అంశం. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో రూపొందించుకున్న 10 సూత్రాల్లో డీప్ టెక్ కూడా ఓ కీలకమైన అంశం" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

**డిసెంబరు నుంచి అమరావతి క్వాంటం వ్యాలీ..** "కృష్ణా నదీ తీరంలో ప్రజా రాజధాని అమరావతిని బ్లూ-గ్రీన్ సిటీగా కాలుష్యరహితంగా నెట్ జీరో కాన్సెప్టుతో నిర్మిస్తున్నాం. అమరావతిని శాశ్వత రాజధానిగా పార్లమెంటు చట్టబద్ధత కల్పించింది. తిరుపతిలో స్పేస్ సిటీ, ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, గ్రీన్ హైడ్రోజన్, విశాఖలో మెడ్ టెక్, అనంతపురంలో సెమీ కండక్టర్ ఉత్పత్తి కేంద్రాలు అభివృద్ధి చేస్తున్నాం. డేటా సెంటర్ సహా, ఏఐ మౌలిక సదుపాయాలను కూడా త్వరలోనే ప్రారంభించబోతున్నాం. 15 బిలియన్ యూఎస్ డాలర్లతో గూగుల్ అతిపెద్ద పెట్టుబడిని ఏపీలో పెడుతోంది. ప్రతీ పౌరుడికీ ఏఐ లాంటి సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలన్నదే మా లక్ష్యం. డిసెంబరు నుంచి అమరావతిలో క్వాంటం వ్యాలీ కూడా ప్రారంభం అవుతుంది.

# కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాల నిర్వహణ : మంత్రి కందుల దుర్గేష్

- గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం • 10 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా - భద్రతకు అగ్రతాంబూలం • త్వరలోనే రాజమహేంద్రవరంలో గోదావరి పుష్కరాలపై సమీక్ష - మంత్రి దుర్గేష్ వెల్లడి



**అమరావతి/ మంగళగిరి,కలంకౌంటర్ :** 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించినట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వివిధ అంశాలపై చర్చించారని, ప్రధానంగా నిడదవోలు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి వివరాలపై సమీక్షించారన్నారు..అదే విధంగా గోదావరి పుష్కరాల నిర్వహణపై దిశానిర్దేశం చేసినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. 2027 జూన్ 26 నుండి జూలై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో వైభవంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచించినట్లు మంత్రి దుర్గేష్ చెప్పారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా ఉత్సవానికి సుమారు 10 కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేశామని, భక్తుల సౌకర్యాలకు, భద్రతకు పెద్దపీట వేయాలని భావించినట్లు వెల్లడించారు. రాజమహేంద్రవరంతో పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ఘాట్ల ఆధునీకరణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. భక్తుల కోసం ప్రత్యేక వసతులు, మంచినీరు, పారిశుద్ధ్యం మరియు విశ్రాంతి గదుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. కోట్లాదిగా తరలివచ్చే భక్తుల భద్రతకు పెద్దపీట వేయాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణను సిద్ధం చేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భక్తుల రద్దీని క్రమబద్ధీకరించనున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. పుష్కర ఏర్పాట్లపై త్వరలోనే రాజమహేంద్రవరంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ భేటీలో క్షేత్రస్థాయి సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై పలు నిర్ణయాలు తీసుకోనున్నామన్నారు. రాష్ట్ర గౌరవం ఇనుమడించేలా, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ గోదావరి పుష్కరాలను నిర్వహించబోతోందని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అదేవిధంగా నిడదవోలు నియోజకవర్గంలో గ్రామీణ అభివృద్ధి, పంచాయితీ రాజ్ శాఖ ద్వారా పలు పనులు చేపట్టినట్లు, వాటి పురోగతిని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు వివరించినట్లు మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా తెలిపారు.

# కసి, పట్టుదలే మనల్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి

- సవాళ్లను అధిగమించి ప్రపంచాన్ని జయించండి • ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను అన్ని విధాల ప్రోత్సహిస్తాం • ప్రతి ఏడాది మిమ్మల్ని గుర్తించి ప్రోత్సహించాలనేది ప్రభుత్వ లక్ష్యం • సమగ్రశిక్ష ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం • ఎవరెస్ట్ పర్వతారోహణ చేయనున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల బృందం • విద్యార్థుల నేపాల్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణ యాత్రను ప్రారంభించిన మంత్రి లోకేష్ • దేశంలోనే తొలిసారిగా ప్రత్యేక ప్రతిభావంతుల ఎవరెస్ట్ శిఖర అధిరోహణ యాత్ర • విద్యార్థులను అభినందిస్తూ.. శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

**ఉండవల్లి,కలంకౌంటర్ :** కసి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదంటూ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులకు ఏపీ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో దేశంలోనే మొదటిసారిగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల బృందం నేపాల్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణ యాత్రను ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల బృందం నేపాల్ ఎవరెస్ట్ శిఖర అధిరోహణ యాత్ర చేపట్టడం దేశంలో ఇదే తొలిసారి. 21 మంది విద్యార్థుల బృందం ఈ నెల ఏప్రిల్ 15 నుంచి 30వ తేదీ వరకు 16 రోజుల పాటు ఈ సాహసయాత్ర చేయనుంది. 5,364 మీటర్ల ఎత్తులోని ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ను ప్రభుత్వ విద్యాసంస్థల్లో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు అధిరోహించనున్నారు. వీరిలో 8 మంది బాలికలు ఉన్నారు. 15వ తేదీన మధ్యాహ్నం విద్యార్థుల బృందం నేపాల్ రాజధాని ఖాట్మండూకు చేరుకోనుంది. అక్కడి నుంచి ఈ ఎవరెస్ట్ పర్వతారోహణ సాహసయాత్ర ప్రారంభం కానుంది.

**కసి, పట్టుదలే మనల్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి..** నేపాల్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ట్రెక్కింగ్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వారితో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల నేపాల్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణ యాత్ర చాలా ఆసక్తిగా అనిపిస్తోంది. మాలో ఉండని కృషి, పట్టుదల మీలో ఉంటాయి. మీ జీవితంలో ఇప్పటివరకు ఎన్నో మాటలు, అవమానాలు ఎదుర్కొని ఉంటారు. వాటన్నింటిని అధిగమించి ఇక్కడి వరకు వచ్చారు. మనలో ఉన్న కసి, పట్టుదలే



మనల్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి.

**సవాళ్లను అధిగమించి ప్రపంచాన్ని జయించండి..** ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అన్ని విధాల అండగా ఉంటాం. సపోర్ట్ చేస్తాం. మీలాంటి వారిని ప్రోత్సహిస్తే సమాజంలో కూడా మార్పు వస్తుంది. దీనిని నేను వ్యక్తిగతంగా తీసుకుంటా. మా కుటుంబంలో కూడా ఒకరు సరిగా మాట్లాడటానికి తడబడేవారు. అనేక ఇబ్బందులు పడ్డారు. అతన్ని చాలామంది ఎగతాళి చేసేవారు. దేవుడు ప్రతి కుటుంబానికి ఓ పరీక్ష పెడతాడు. ఆ పరీక్షను జయించే శక్తి కూడా ఇస్తాడు. మీ అందరికీ ఆ శక్తి ఉంది. ప్రభుత్వం కూడా మద్దతుగా ఉంటుంది. సవాళ్లను అధిగమనించి ప్రపంచాన్ని జయించండి. సమాజం మిమ్మల్ని గౌరవించాలి. సొంత పిల్లల్లా చూసుకోవాలి. వ్యక్తిగా నేను ఆశించేది సమాజంలో మీరు తీసుకురావాలి.

**ప్రతి ఏడాది మిమ్మల్ని గుర్తించి ప్రోత్సహించాలనేది ప్రభుత్వ లక్ష్యం..** ప్రతి ఏడాది మిమ్మల్ని గుర్తించి ప్రోత్సహించాలనేది ప్రభుత్వ లక్ష్యం. నూతన ఆవిష్కరణలను సీఎం చంద్రబాబునాయుడు గారు కూడా ఎప్పుడూ ప్రోత్సహిస్తారు. ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు గారు ఒకమాట చెప్పారు.

# పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- ఎన్టీఆర్, చంద్రబాబుల ఆశయ సాధనే మన మార్గం • - పార్టీ కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించి టీడీపీ బలోపేతానికి కృషి చేయండి • "కాఫీ కబుర్లు" కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్చార్జిలకు మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం

**మంగళగిరి,కలంకౌంటర్ :** పార్టీ సిద్ధాంతాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, పార్టీ సిద్ధాంతాలే నాయకత్వానికి బలం అని విద్య, ఐటి శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జుల శిక్షణ తరగతుల్లో భాగంగా "కాఫీ కబుర్లు" కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలుగుజాతి విశ్వఖ్యాతి అంటే గుర్తుకు వచ్చేది అన్న ఎన్టీఆర్. తెలుగు జాతి శక్తి ఏంటో ప్రపంచానికి చూపించిన వ్యక్తి చంద్రబాబు. వీరిద్దరూ బలమైన సిద్ధాంతాలతోనే విజయం సాధించారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని నేతలకు మంత్రి సూచించారు.



**సిద్ధాంతాలే నాయకత్వానికి బలం ..** "ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మాత్రమే కాకుండా, వాటి వెనుక ఉన్న పార్టీ సిద్ధాంతాలను కూడా ప్రజలకు వివరించడం అత్యంత కీలకం. కార్యకర్తల మధ్య ఐక్యత, క్రమశిక్షణ ఉంటేనే పార్టీ మరింత బలపడుతుంది. సిద్ధాంతాలపై ఆధారపడి ప్రజల్లో విశ్వాసం పెంచుకుంటేనే దీర్ఘకాలిక రాజకీయ విజయాలు సాధ్యమవుతాయి. సిద్ధాంతపరంగా ఎదిగిన నాయకత్వమే పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది" అని మంత్రి తెలిపారు.

**ఆరు ముఖ్య సిద్ధాంతాలు గ్రామస్థాయికి తీసుకెళ్లాలి..** "ఎన్ని పనులున్నా సీఎం గారు, నేను ప్రతి వారం ఏదో ఒక ఒక రోజు పార్టీ కార్యాలయంలో గడుపుతూ ప్రజా సమస్యలను వింటూ పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త ప్రత్యేక సమయం కేటాయించాలి. పార్టీ ప్రవేశపెట్టిన ఆరు ముఖ్య సిద్ధాంతాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం కల్పించాలి" అని సూచించారు.

**పార్టీతో కార్యకర్తలను అనుసంధానం చేసేది మై టీడీపీ యాప్..** "ప్రతి బూత్, క్లస్టర్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం అత్యవసరం. రాజకీయాల్లో కొత్త తరాన్ని ప్రోత్సహిస్తూ, సిద్ధాంతపరంగా శిక్షణ పొందిన నాయకత్వాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది. "మై టీడీపీ" యాప్ ద్వారా కార్యకర్తలు తమ కార్యకలాపాలను తప్పనిసరిగా నమోదు చేయాలి. ప్రతి ఒక్కరి పనితీరును పార్టీ అధినేత పర్యవేక్షిస్తున్నారు. వ్యక్తిగత పనులు పూర్తిచేసుకుని కొంత సమయం కేటాయించి క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వాటిని అధికారుల ద్వారా పరిష్కరించేందుకు కృషి చేయండి. సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించండి. కష్టపడిన వారికి తగిన గుర్తింపు తప్పకుండా లభిస్తుంది" అని హామీ ఇచ్చారు.

**రెడ్ బుక్ సమాజ బాగు కోసం..రాజారెడ్డి రాజ్యాంగంతోఈ విధ్వంసం ..** "గతంలో దేవాలయంలాంటి తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై, చంద్రబాబు గారి ఇంటిపై, నాయకులపై వైసీపీ నాయకులు దాడులు చేశారు. కార్యకర్తలను

- 2లో

# సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

- 1,549 కేసులు నమోదు • 1,344 అరెస్టులు • 4,529 పోస్టుల తొలగింపు • డీజీపీ హరీష్ కుమార్ గుప్తా హెచ్చరిక




**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ పోలీస్ డైరెక్టర్ జనరల్ హరీష్ కుమార్ గుప్తా సోషల్ మీడియా సంబంధిత కేసులను సమీక్షించి, చట్టవిరుద్ధ కార్యకలాపాల కోసం సోషల్ మీడియా వేదికలను దుర్వినియోగం చేయడంపై కఠినమైన హెచ్చరికలు జారీ చేశారు.వాట్సాప్, ఫేస్ బుక్, ఎక్స్ ఇన్స్టాగ్రామ్ వేదికల్లో కొందరు వ్యక్తులు మరియు వ్యవస్థీకృత బృందాలు అవమానకర వ్యాఖ్యలు, రాజకీయ ప్రేరిత పోస్టులు, సామాజిక ఉద్రిక్తతలు రేకెత్తించే సందేశాలు, తప్పుడు ప్రచారం మరియు వదంతులను వ్యాప్తి చేస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఇవి ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే తీవ్రమైన నేరాలుగా పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా "జీరో టోలరెన్స్" విధానాన్ని కఠినంగా అమలు చేస్తూ, ఆంధ్రప్రదేశ్ పోలీస్ 1,549 కేసులు నమోదు చేసి, 1,344 మందికి పైగా అరెస్టులు చేసినట్లు వెల్లడించారు. అదనంగా 4,529 చట్టవిరుద్ధ పోస్టులను తొలగించినట్లు తెలిపారు. చట్టపరమైన చర్యలు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ 2000 మరియు భారతీయ న్యాయ సంహిత 2023 కింద తీసుకుంటున్నారు. ఇందులో సెక్షన్ 111 (ఆర్గనైజ్డ్ క్రైమ్) వంటి కఠిన నిబంధనలు కూడా వర్తింపజేస్తున్నారు. అదేవిధంగా, భారతీయ నాగరిక సురక్ష సంహిత 2023 నిబంధనల ప్రకారం, నిందితులు ఉద్దేశపూర్వకంగా విచారణకు హాజరుకాకుండా తప్పించుకునే పరిస్థితుల్లో కూడా ' ట్రయల్ ఇన్ ఆబ్సెంట్ ' విధానం అమలు చేయబడుతుంది. కోర్టు సమన్లు, వారెంట్లు జారీ అయినప్పటికీ హాజరు కాకపోతే, వారి గైర్హాజరీలోనే విచారణ కొనసాగించి తీర్పు ఇవ్వబడుతుంది. దీని ద్వారా న్యాయ ప్రక్రియ ఆలస్యం కాకుండా కొనసాగించబడుతూ, నేరస్తులు శిక్ష నుంచి తప్పించుకోకుండా నిరోధించబడతారు. పదే పదే ఈ తరహా నేరాలకు పాల్పడే వ్యక్తులు మరియు వ్యవస్థీకృత గ్రూపులపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సంఘటిత నేరాలకు సంబంధించిన చట్టాలను కూడా ప్రయోగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. నకిలీ అకౌంట్లు, గోప్యత పేరుతో తప్పించుకునే ప్రయత్నాలు చేసినా, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిందితులను గుర్తించి అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు. అధునాతన సాంకేతికతతో ప్రత్యేక సోషల్ మీడియా మానిటరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసి, ఏ × విశ్లేషణ, రియల్ టైమ్ పర్యవేక్షణ, డిజిటల్ ఫోరెన్సిక్ పద్ధతులతో నేరాలను వేగంగా గుర్తిస్తున్నట్లు తెలిపారు.ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఏదైనా సమాచారాన్ని సోషల్ మీడియా వేదికల్లో పంచుకునే ముందు ధృవీకరించుకోవాలని, నిర్ధారణ లేని సమాచారాన్ని పంచుకోవద్దని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా హెచ్చరించారు.


## భారత రాజ్యాంగ నిర్మాతకు నివాళి





**అమరావతి,కలంకౌంటర్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి , మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి , లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు , పలువురు నేతలు.

## భారత రాజ్యాంగ నిర్మాతకు నివాళి



**అమరావతి,కలంకౌంటర్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి నారా లోకేష్ .

## నగరపాలక సంస్థలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**తిరుపతి,కలంకౌంటర్ :** తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో రాజ్యాం గనిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ చిత్ర పటానికి కమిషనర్ ఎన్.మౌర్య, అధికారులు పుష్పంజలి సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని తెలిపారు. సమాజంలో సమానత్వం, సౌభ్రాతృత్వం, విద్య, శాంతిని నెలకొల్పేందుకు కృషి చేసిన మహోన్నత నాయకుడు అని కొనియాడారు. ఆయన రూపొందించిన రాజ్యాంగం అందరికీ మార్గదర్శకంగా నిలిచిందని తెలిపారు. ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ శారదా దేవి, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, మేనేజర్ హాసీమ్, వెటర్నరీ ఆఫీసర్ గుణ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ మేధావికి నివాళి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త



**హైదరాబాద్,కలంకౌంటర్ :** భారతరత్న భారత రాజ్యాంగ నిర్మాత డా,, బాబా సాహెబ్ అంబేద్కర్ 135జయంతి సందర్భంగా ఎల్బీనగర్ రింగ్ రోడ్డు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహోన్నత ఆశయాలతో, సమానత్వమే ఊపిరిగా నవభారత రాజ్యాంగాన్ని నిర్మించిన మహనీయుడు బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఘన నివాళి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడల రమేష్. జీడి నరసింహ మాదిగ జేఏసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నక్క మహేష్. గిరిజన మహా శక్తి రాష్ట్ర అధ్యక్షులు. చందర్ నాయక్. రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

(మొదటి పేజీ తరువాయి)

హింసించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై దమనకాండకు పాల్పడ్డారు. అమర్నాథ్ గౌడ్, అబ్దుల్ సలాం, తోట చంద్రయ్యలను వెంటాడి మరీ చంపారు. డా.సుధాకర్, కోడెల శివప్రసాద్, మిస్బా అనే చిన్నారిలను వేధించి మరణానికి కారకులయ్యారు. అధికారంలో ఉన్నప్పుడు విధ్వంసం-దాడులు-హత్యలు-అవినీతితో చెలరేగిపోయిన జగన్..అధికారం పోయాక కూటమి ప్రభుత్వంపై విషప్రచారాలతో విరుచుకుపడుతున్నాడు. ఐకమత్యంగా పోరాట స్ఫూర్తితో వైసీపీ ఫేక్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే ఫేక్ సమాచారాన్ని తిప్పికొట్టండి. నా రెడ్ బుక్ సమాజ బాగు కోసం అయితే, రాజారెడ్డి రాజ్యాంగంతో జగన్ సమాజాన్ని నాశనం చేయాలనుకున్నాడు. ఏ ఆత్మ చెప్పిందో కానీ మావిగన్ అంటూ కలవరిస్తున్నాడు జగన్.

**నేతల మధ్య సఖ్యత ముఖ్యం..** "రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉంది కాబట్టే అమరావతికి చట్టబద్ధత వచ్చింది, విశాఖ ఉక్కు పరిరక్షణ జరిగింది, రాష్ట్రానికి ప్రత్యేక నిధుల సాధన వంటి విజయాలు సాధ్యమవుతున్నాయి. పొత్తు ధర్మాన్ని పాటిస్తూ కూటమి భాగస్వాములతో కలిసి పనిచేయాలి. కుటుంబంలా ఐక్యంగా ఉంటేనే ప్రభుత్వం స్థిరంగా ఉంటుంది. కుటుంబసభ్యుల మధ్య కలహాలు వస్తే అంతా కలిసి కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకున్నట్టే, కూటమి నేతలు కుటుంబంలా కూర్చొని చర్చించుకుని విభేదాలు విడనాడలి-- అని సూచించారు.

# మానవతా వాది.. గొప్ప సంఘ సంస్కర్త డా. బీఆర్ అంబేద్కర్

- ఆయన ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి దిశగా అడుగులు
- సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి
- విజయవాడలో ఘనంగా రాష్ట్రస్థాయి డా. బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి మహోత్సవం







**అమరావతి, కలంకౌంటర్ :** భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ సమాజంలో సమానత్వం, న్యాయం, స్వేచ్ఛా విలువల స్థాపించడానికి చేసిన కృషి అపారమని, అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని, ఆయన చూపిన బాటలోనే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతూ సామాజిక న్యాయ స్ఫూర్తితో ముందుకెళ్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమం, స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామం శాఖా మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. మంగళవారం నవ భారత రాజ్యాంగ నిర్మాత-భారత రత్న బాబా సాహెబ్ డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్రస్థాయి 135వ జయంతి మహోత్సవం విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. కళాక్షేత్రం ఎదురుగా ఉన్న డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించిన అనంతరం మంత్రివర్యులు ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వివక్ష విజ్ఞాన సంపదకు అడ్డంకి కాదని నిరూపించి అడ్డంకులను అధిగమిస్తూ అఖండ భారతావనికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డా. బీఆర్ అంబేద్కర్ అని పేర్కొన్నారు. ఈ రోజు సమాజంలోని ప్రతిఒక్కరూ స్వేచ్ఛ, సమానత్వం, హక్కులు అనుభవిస్తున్నామంటే అందుకు రాజ్యాంగమే కారణమని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా గౌరవ ముఖ్యమంత్రి సమాజంలోని అన్ని వర్గాలు సమానంగా ఎదిగేందుకు కృషిచేస్తున్నారన్నారు. నాణ్యమైన విద్యను అందించడంలో రాజీలేకుండా కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని దాదాపు 1,054 హాస్టళ్ళు, 190 గురుకులాల్లో సౌకర్యాల కల్పనకు చిత్తశుద్ధితో కృషిచేస్తున్నామని, గౌరవ ముఖ్యమంత్రి కూడా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. వసతులతో పాటు కొత్త భవనాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఇక్కడి విద్యార్థుల్లో గతేడాది దాదాపు 60 మందికి ఐఐటీ, నీట్ సీట్లు వస్తే ఈసారి 200 మందికి పైగా సీట్లు సాధించేలా శిక్షణ అందించడం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు కేంద్రాల ద్వారా యూపీఎస్సీ సివిల్స్ శిక్షణ ఇస్తున్నామని మంత్రివర్యులు డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి వివరించారు.

# ఇంటింటికీ "జై భీమ్" నినాదం - వైయస్సార్‌సీపీ నేతల పిలుపు

**తాడేపల్లి,కలంకౌంటర్ :** తాడేపల్లి లోని వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైయస్సార్‌సీపీ నేతలు, మాజీ మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, మేకతోటి సుచరిత, వైయస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్ రావు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎంపీ మార్గాని భరత్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ అమ్మాజీ, పబ్లిసిటి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకమాను రాజశేఖర్, వంగవీటి నరేంద్ర, వేల్పుల రవికుమార్, రవిచంద్ర, గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు. "జై భీమ్" నినాదం ఇంటింటికీ చేరాలని, అదే వైయస్ జగన్ మోహన్ రెడ్డి విధానంగా రాష్ట్రవ్యాప్తంగా మార్మోగాలని వైయస్ఆర్‌సీపీ నేతలు పిలుపునిచ్చారు. జగనన్న చెప్పిన 'జై భీమ్' రాబోయే రోజుల్లో ప్రతి గడపకు చేరాలి. అప్పుడే ఈ రాష్ట్రంలో అంబేద్కర్ ఆలోచన విధానం వర్ధిల్లుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. వైయస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచన విధానంతో గత ఐదేళ్లు పాలన చేసి అన్ని వర్గాలకు మేలు చేశారని నేతలు గుర్తుచేసుకున్నారు. తాడేపల్లిలోని వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్ఆర్‌సీపీ నేతలు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి, అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. సామాజిక న్యాయం, సమానత్వం సాధనలో అంబేద్కర్ చూపిన మార్గంలోనే ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు ఏమన్నారంటే..వారి మాటల్లోనే..

**- "జై భీమ్ నినాదం ఇంటింటికీ చేరాలి: మాజీ మంత్రి మేరుగు నాగార్జున**

దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతిని వైయస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో జరుపుకోవడం ముదాహంగా భావిస్తున్నాం. బడుగు, బలహీన వర్గాల స్థితిగతులను మార్చడానికి ఈ భూమిపైకి వచ్చిన అత్యంత మేధావి అంబేద్కర్. దేశానికి రాజ్యాంగాన్ని ప్రసాదించి ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి గడించారు. ఈ రోజు ఇతర దేశాలు కూడా ఆ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నాయి. పేదలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, అవకాశాలు కల్పించిన మహనీయుడు ఆయన. దేశం, రాష్ట్రంలో రాజ్యాంగానికి లోబడి పాలన జరగాలి. కానీ ఇవాళ రాష్ట్రంలో 'రెడ్‌బుక్ రాజ్యాంగం' నడుస్తోంది. రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కులను అపహాస్యం చేస్తున్నారు. నాడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి రాజ్యాంగ వ్యవస్థను ప్రతిష్టించి, సంక్షేమ పథకాలను గడప వద్దకే అందించారు. పేదవాడికి చదువే గొప్ప ఆస్తి అని అంబేద్కర్ చెప్పిన ఆలోచనను జగన్ అమలు చేశారు. కానీ ఈ రోజు ఆ దిశగా పాలన సాగడం లేదు. కూటమి పాలనలో అక్షరాస్యత తగ్గింది. 'అమ్మ ఒడి' ఏమైంది? ఆరోగ్య సేవలు ఎక్కడ? ఆరోగ్యశ్రీ పేదలకు అందకుండా చేస్తున్నారు. దళితులపై దాడులు జరుగుతున్నాయి. రాజ్యాంగబద్ధమైన స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లే దాడులు చేస్తుంటే రాజ్యాంగం ఎక్కడికి వెళ్తుంది? 'జై భీమ్' నినాదం ఇంటింటికీ వెళ్లాలి. అది జగన్ నినాదంగా మార్మోగాలి. జగనన్న చెప్పిన 'జై భీమ్' రాబోయే రోజుల్లో ప్రతి గడపకు చేరాలి. అప్పుడే ఈ రాష్ట్రంలో అంబేద్కర్ ఆలోచన విధానం వర్ధిల్లుతుంది. రాబోయే రోజుల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే అంబేద్కర్ ఆశయాలు విరాజిల్లుతాయి.





**- పదే పదే వైయస్ జగన్ ఆలోచన విధానం గుర్తుకొస్తోంది: మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్**

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పింది. దళితులకు ఈ ప్రభుత్వం చేసింది శూన్యం. అందుకే వైయస్ జగన్ మోహన్ రెడ్డి పాలన పదేపదే గుర్తుకు వస్తోంది. డా. బి.ఆర్. అంబేద్కర్ భావజాలాన్ని పుణికిపుచ్చుకుని జగన్ గత ఐదేళ్లు పాలన చేశారు. కానీ ఇవాళ రాష్ట్రంలో అంబేద్కర్ భావజాలానికి విరుద్ధంగా పాలన సాగుతోంది. అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేసుకునే ప్రయత్నాలు చేసినా కూడా కూటమి ప్రభుత్వం అడ్డుకుంటోంది. కొండేపిలో అంబేద్కర్, పూలే విగ్రహాల ఏర్పాటు సమయంలో దళితుల మధ్య వర్గవైషమ్యాలు సృష్టించి గొడవలు పెంచారు. దాంతో దళితుల మనోభావాలు దెబ్బతిన్నాయి. రాజధాని ప్రాంతంలో దళితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జగన్ నిర్ణయం తీసుకుంటే, చంద్రబాబు అడ్డుకున్నారు. ఈ కూటమి పాలనలో అరాచకాలకు అంతు లేదు. సామాజిక న్యాయం కనుమరుగైంది. ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తున్నారు. సోషల్ జస్టిస్ విగ్రహాన్ని కూడా పట్టించుకోవడం లేదు. ఇంగ్లీష్ మీడియం విద్య మళ్లీ రావాలంటే జగన్ రావాలి. రాబోయే రోజుల్లో ఐక్యతతో ముందుకు సాగి జగన్ ని ముఖ్యమంత్రిని చేసుకుందాం. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పని చేసిన నాయకుడు జగన్ నే మళ్లీ సీఎం చేసుకోవాలి.

**- అంబేద్కర్ ఆలోచనలను ఆచరణలో పెట్టిన నాయకుడు జగన్: మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత**

అంబేద్కర్ ఆలోచన విధానపరంగా పరిపాలన చేసింది ఒక్క వైఎస్ జగన్ మోహన్ రెడ్డి .ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలకు ఉపముఖ్యమంత్రి పదవులు ఇచ్చి గౌరవించిన ఏకైక ముఖ్యమంత్రి ఆయనే. ఆయన అమలు చేసిన పథకాలు దళితులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయి. ఇంగ్లీష్ మీడియం ద్వారా పేద పిల్లలకు ఉచిత విద్య అందించారు. గుడిసెల్లో జీవించే పేదలకు 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. సమసమాజం కోసం అందరూ కలిసిమెలిసి ఉండాలని భావించిన గొప్ప నాయకుడు జగన్ . పేదలకు నాణ్యమైన వైద్యం అందించారు. గుంటూరులో దళిత బాలిక హత్య జరిగినప్పుడు ఆ కుటుంబానికి అండగా నిలబడి, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, భూమి, ఇంటి స్థలం ఇచ్చి న్యాయం చేశారు. 'జై భీమ్' నినాదంతో మాకు ధైర్యం ఇచ్చిన జగన్ కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

**- ప్రజల మధ్యలోనే రాజధాని ఉండాలి: జూపూడి ప్రభాకర్‌రావు**

'జై భీమ్' నినాదంలో 'జై' అంటే వర్ధిల్లాలి, 'భీమ్' అంటే జ్ఞానం... అంటే జ్ఞానం వర్ధిల్లాలనే అర్థం అంబేద్కర్ కి వర్తిస్తుంది. ఏప్రిల్ నెలలోనే మహాత్మా జ్యోతిరావు పూలే, బాబూ జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ జన్మించారు. డాక్టర్ వైయస్ఆర్ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ పరిపాలనను చూశాం. 2019--2024 మధ్య అంబేద్కర్ ఆశయాలను జగన్ తన పాలనలో ఆచరణలో చూపించారు. ఆంధ్రప్రదేశ్‌లో మచిలీపట్నం -- విజయవాడ -- గుంటూరు కారిడార్‌ను 'మావిగన్'గా అభివృద్ధి చేయాలని జగన్ ప్రతిపాదించారు. ప్రజల మధ్యలోనే రాజధాని ఉండాలి... పొలాల మధ్య కాదు. మనుషులు ఉన్న చోటే రాజధాని ఉండాలి. అదే అంబేద్కర్ ఆశయాలకు అనుగుణమైన అభివృద్ధి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలంటే డిసెంట్రలైజేషన్ అవసరం. ఒక్క ప్రాంతంలోనే పెట్టుబడులు కేంద్రీకరించడం సరైంది కాదు. జగన్ ప్రతిపాదించిన మావిగన్ భావనను అంబేద్కర్ ఆశయాల కోణంలో చూడాలి. అంబేద్కర్ ఆశయాలను కొనసాగించే క్రమంలో జగన్ తీసుకున్న నిర్ణయాలను అంబేద్కర్ వాదులంతా బలపరచాలి. దేశంలోని మేధావులంతా కూడా మావిగన్ ప్రతిపాదనపై ఆలోచించాలని కోరుతున్నాను.

**- వందలాది మంది అంబేద్కర్లు మళ్లీ పుట్టాలి :**

**- ... లేళ్ల అప్పిరెడ్డి,టీజేఆర్ సుధాకర్‌బాబు , మొండితోక అరుణ్ కుమార్, కనకారావు**

మా గుండెల్లో బాధ ఉంది. ఈ ప్రభుత్వంలో అట్టడుగు వర్గాలపై దాడులు జరుగుతున్నాయి. జనసేనకు చెందిన మహిళపై దాడి జరిగినా చర్యలు లేవు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పెత్తందార్ల దౌర్జన్యాలు కొనసాగుతున్నాయి. పిఠాపురంలో దళితులను గ్రామ బహిష్కరణ చేశారు. టీ తాగేందుకు కూడా అనుమతించని పరిస్థితులు ఉన్నాయి. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ఈ ఘటనలను ఖండించలేదు. డప్పు కళాకారుడిపై స్పీకర్ దాడి చేసినా స్పందన లేదు. అందుకే వందల, వేల అంబేద్కర్లు పుట్టాలని కోరుకుంటున్నాం. మేము కూడా ఇంగ్లీష్ మీడియం చదువుకోవాలి, ఇళ్లు కట్టుకుని జీవించాలి అనుకుంటున్నాం. కానీ ఈ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజధాని ప్రాంతంలో అందరికీ ఇళ్ల స్థలాలు కేటాయిస్తే అడ్డుకున్నారు. సామాన్యుడు బతకాలంటే జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. 'జై భీమ్--జై జగన్' నినాదాన్ని వాడవాడలో వినిపిస్తాం. జగన్ ని ముఖ్యమంత్రిని చేయడమే మా లక్ష్యం.

# ఆయన బాటలోనే నా ప్రయాణం - ఎమ్మెల్యే ఇంటూరి

- పేదల దేవుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్
- AMC చైర్మన్ పదవిని ఎస్సీలకు కేటాయించిన ఘనత మాది
- కందుకూరులో అంబేద్కర్ భవన్ నిర్మిస్తామన్న ఎమ్మెల్యే

**కందుకూరు, కలంకౌంటర్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయము నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. తదుపరి పార్టీ నాయకులు, కార్యకర్తలు, దళిత, ప్రజా సంఘాల నేతలతో కలిసివెళ్లి పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు.అక్కడే అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రారంభించారు. నిర్వాహకులు రక్తదాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ... దేశ ప్రజలు నిత్యం స్మరించుకోవాల్సిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. స్వలాభం చూసుకోకుండా, అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాంతం కష్టపడ్డారని అన్నారు. చిన్నప్పుడు పాఠశాలలో అంటరానితనానికి గురైన తరువాత పట్టుదలతో... అందరికీ సమాన హక్కులు కల్పించాలన్న లక్ష్యంతో భారత రాజ్యాంగానికి రూపకర్తగా మారారని ఎమ్మెల్యే తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంబేద్కర్ పేరుతో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని నాగేశ్వరరావు చెప్పారు.అంబేద్కర్ ఆశయాలు కొనసాగించేలా, ఆయన చూపిన బాటలోనే తన ప్రయాణం సాగుతుందని ఎమ్మెల్యే ఇంటూరి స్పష్టం చేశారు. కందుకూరు పట్టణంలో త్వరలో అంబేద్కర్ భవన్ నిర్మించి అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ముఖ్యంగా కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్సీలకు కేటాయించిన సంగతిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. దళిత బహుజనులకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వర రావు, రూరల్ అధ్యక్షుడు బూస్సారెడ్డి కృష్ణారెడ్డి, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పూరిమిట్ల మాల్యాద్రి, నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు మాల్యాద్రి, ఎస్సీ నేతలు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ.ప్రారంభించిన చంద్రబాబు





**అమరావతి,కలంకౌంటర్ :** అమరావతిలో తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు . ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని 1ఎస్ ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీ సహా, మేధా టవర్స్‌లోని 1 క్యూ క్వాంటం ఫెసిలిటీని ప్రారంభించి ముఖ్యమంత్రి. కార్యక్రమానికి హాజరైన నేషనల్ క్వాంటం మిషన్, డీఎస్టీ సహా వేర్వేరు క్వాంటం కంపెనీల ప్రతినిధులు, ఐఐటీ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు.

# ఆర్యవైశ్య ఇంజనీరింగ్ విద్యార్థులకు చేయూత


కోనా శ్రీనివాసరావు
రాష్ట్ర అధ్యక్షుడు ఐ వి ఎఫ్


వెంట్రప్రగడ వీరాంజనేయులు
ఆర్గనైజింగ్ సెక్రటరీ,ఐ వి ఎఫ్

**ఉయ్యూరు,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గవర్నమెంట్ కాలేజి లో ఇంజనీరింగ్ విద్యనభ్యసిస్తున్న ఆర్యవైశ్య విద్యార్థిని విద్యార్థులకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంట్రప్రగడ వీరాంజనేయులు తెలియజేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కోన శ్రీనివాసరావు వ్యక్తిగత రు. 20 లక్షల వ్యక్తిగత వితరణతో రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్య అభ్యసిస్తున్న 50 మంది ఆర్యవైశ్య విద్యార్థులకు ల్యాప్టాప్ లు పంపిణీ చేయదల్చామని తెలిపారు. ఇప్పటికే పలు నిరుపేద ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్షిప్ రూపంలో లక్షలాది రూపాయలు అందిస్తున్నామని చెప్పారు. ఈ ల్యాప్టాప్ లు పొందే విద్యార్థులు 75 శాతం మార్కులు సాధించవలసి ఉంటుందని, ఆయా జిల్లాల అధ్యక్షులు ద్వారా ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆంజనేయులు తెలియజేశారు. ఈ అవకాశాన్ని నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు(ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ కాలేజీ లో చదివే విద్యార్థులు మాత్రమే అప్లయ్ చేసుకోగలరు). ఆర్యవైశ్య విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఫెడరేషన్ రాష్ట్ర నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ 88వ రోజు ప్రజాదర్బార్

● ప్రజల నుంచి వినతులు స్వీకరణ ● సమస్యలు పరిష్కరించి అండగా ఉంటామని భరోసా



**మంగళగిరి,కలంకౌంటర్ :** మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 88వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పార్టీ కార్యాలయానికి వచ్చిన సామాన్యులు, టీడీపీ కార్యకర్తలను మంత్రి ఆప్యాయంగా పలకరించారు. వివిధ సమస్యలపై వారి నుంచి వినతులు స్వీకరించారు. నంద్యాల జిల్లా జూపాడు మండలం 35 బొల్లవరం, తాటిపాడు, భాస్కరాపురం గ్రామాల పరిధిలోని సుమారు 72 ఎకరాలను నిషేధిత భూముల జాబితా 22(ఏ)1(సి)లో చేర్చారని, విచారించి ఆయా భూములను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయా భూములు వారసత్వంగా తమకు సంక్రమించాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల మంది ఉన్న టూవీలర్స్ మెకానిక్ లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టూవీలర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి కోరారు. రాష్ట్రంలో ముదిరాజ్ సామాజికవర్గానికి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని ముదిరాజ్ సంఘం ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.


**డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్న విజయ్ కలాంకు మంత్రి లోకేష్ అభినందన..** అంతకుముందు డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ మిషన్ దండి మార్చ్ 2.౦ పేరుతో తిరుపతి నుంచి విశాఖ వరకు వెయ్యి కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర చేపట్టిన వైబ్రంట్స్ ఆఫ్ కలామ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు విజయ్ కలాంను పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిసి మంత్రి అభినందించారు. ఇప్పటివరకు విజయ్ కలాం 549 కి.మీల సైకిల్ యాత్రను పూర్తిచేశారు.

# ఘనంగా అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు




**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి మండలంలో వాడ వాడలా అంబేద్కర్ 135 జయంతి వేడుకలు జై భీమ్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని జై భీమ్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో పలు స్థాయిలలో గల నాయకులు , అధికారులు మండలంలోని బంటుమిల్లి, పెద్ద తుమ్మిడి జయపురం బంటుమిల్లి ఆముదాలపల్లి మల్లేశ్వరం అత్తమూరు గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు అలాగే బంటుమిల్లి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో గల అంబేద్కర్ విగ్రహానికి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కూ టమి నాయకులు పూలమాలనేసి నివాళులర్పించారు అనంతరం జై భీమ్ యూత్ కమిటీ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. అలాగే అడిషనల్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మోక సత్తిబాబు ఐపీఎస్ అంబేద్కర్ వేడుకల్లో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. అంబేద్కర్ ఆసియా సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అలాగే పెడనియర్ వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ ఉప్పల రాము వైఎస్ఆర్సిపి శ్రేణులు అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్నారు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు అనంతరం రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించారు.

# మధ్యాహ్న భోజన నిర్వహణ ప్రైవేట్ సంస్థలకు అప్పగించవద్దు




**ఉయ్యూరు,కలంకౌంటర్ :** మధ్యాహ్న భోజనం పథకం ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలన్న ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ బి రాజేశ్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజనపథకం ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ఆలోచన చేయడాన్ని నిరసిస్తూ మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ కార్మికులతో కలిసి మంగళవారం ఉయ్యూరులో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం చేస్తున్న ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వంట ఏజెన్సీ నాయకులు ఝాన్సీ, విజయరాణి, ఐద్వా నాయకురాలు బి కీర్తి తదితరు లు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తుంది - జిల్లా కలెక్టర్ రాజా బాబు





**ఒంగోలు,కలంకౌంటర్ :** అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రభుత్వ యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. బాబాసాహెబ్ 135వ జయంతిని పురస్కరించుకుని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలులో నిర్వహించిన వేడుకలలో కలెక్టర్ తో పాటు ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే శ్రీ.బి. ఎన్.విజయ్ కుమార్, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, పిడిసిసి బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర, ఇతర ప్రజా ప్రతినిధులు, మాజీ మేయర్ గంగాడ సుజాత, దళిత సంఘాల నాయకులతో కలిసి ముందుగా హెచ్.సి.ఎం. కాలేజీ సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. తదుపరి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ సమీపంలోని అంబేద్కర్, జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు, అంబేద్కర్ భవనంలోని విగ్రహానికి వీరు పూలమాలలు వేశారు. అనంతరం అంబేద్కర్ భవనంలో బాబా సాహెబ్ జయంతి మహోత్సవం కలెక్టర్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు, దళిత సంఘాల నాయకులు కేకు కట్ చేసి, ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆత్మగౌరవం, ఆత్మస్థైర్యానికి అంబేద్కర్ ప్రతీకగా నిలిచినట్లు చెప్పారు. బాల్యంలో పేదరికంతో గడిపినప్పటికీ ఉన్నత విద్యాభ్యాసం చేసి, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగాన్ని అందించే ఉన్న స్థానానికి ఎదిగిన అంబేద్కరును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. అంబేద్కర్ స్ఫూర్తితో, పోరాట పటిమతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను కూడా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పేదరికం నిర్మూలించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పి-4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. దీనితోపాటు ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అర్హులందరికీ అందేలా జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. జిల్లాలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెడతానని కలెక్టర్ ప్రకటించారు. ఎస్పీ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. వారికి పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే జనార్ధన్ మాట్లాడుతూ దూర దృష్టి కలిగిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. అంబేద్కర్ చూపిన బాటలోనే పేదరికం నిర్మూలించేందుకు వివిధ సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు చెప్పారు. అంబేద్కర్ భవనానికి అవసరమైన ఫర్నిచర్, ఇతర మరమ్మతులను 75 లక్షల రూపాయలతో చేపడుతానని ప్రకటించారు. ఈ ప్రాంగణంలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఒంగోలు నగరంలో అన్ని వసతులతో ఎస్సీ స్టడీ సెంటర్ ను కూడా పెట్టేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. నగరంలో జగ్జీవన్ భవన్ ను కూడా నిర్మిస్తామన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ అందరివాడు అని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు. వన్నె తరగని వ్యక్తిత్వం అంబేద్కర్ సొంతమని అన్నారు. బుద్ధిని తర్వాత భారతదేశంలో జన్మించిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని ఆయన వ్యాఖ్యానించారు. బడుగు బలహీన వర్గాల సమస్యలను సమన్వయంతో పనిచేసి పరిష్కరిస్తామని చెప్పారు. రియాజ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం, అభ్యున్నతి కోసం దూరదృష్టితో ఆలోచించి రాజ్యాంగాన్ని అందించిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి.చిన ఓబులేసు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, డిపిఓ వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, బిజెపి జిల్లా అధ్యక్షులు ఎస్. శ్రీనివాస్, దళిత సంఘాల నాయకులు నీలం నాగేందర్, ఉసురుపాటి బ్రహ్మయ్య, పాలడుగు విజయేంద్రన్, చప్పిడి వెంగళరావు, బిల్లా చెన్నయ్య, చప్పిడి రవిశంకర్, తోరటి ఆనంద్, జంద్రాజుపల్లి ఆంజనేయులు, కోటి మాదిగ, కత్తి కళ్యాణ్, పెద్ది పోగు కోటేశ్వర రావు, తుల్లిబల్లి అశోక్, కొమ్ము రవిచంద్ర, తిరువీధి బాబు, కొమ్ము సామేలు, లింగంగుంట రవిబాబు, చుండి శ్యాంసన్, చంద్ర బోసు, వర్ల దేవదాసు, రఘురాం, బుద్ధ కోటి, చైతన్య ప్రసాద్, శశికాంత్ భూషణ్, రాజు విమల్, తదితరులు ప్రసంగించారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు కలిసి సహపంక్తి భోజనం చేశారు.

# బంటుమిల్లిలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చిన మిడ్ డే మీల్స్ వర్కర్లు



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** రాష్ట్రవ్యాప్తంగా మిడ్ డే మిల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మిడ్ డే మీల్స్ వర్కర్లు అంబేద్కర్ జయంతి సందర్భంగా యూనియన్ పిలుపుమేరకు బంటుమిల్లి అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పలు డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా మిడ్ డే మీల్స్ కార్మికులు వినతి పత్రంలో స్మాటు కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఒక్కొక్కరి విద్యార్థికి మెనూ 20 రూపాయల మెనూ చార్జీలు తగ్గకుండా పెంచాలని, మిడ్ డే మిల్ మిల్లు వంర్కర్ కి పదివేల రూపాయలు వేతనం ఇవ్వాలని ,ప్రమాద బీమా సౌకర్యం ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్ల తో కూడిన మించపత్రాన్ని అంబేద్కర్ విగ్రహానికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో మిడ్ డే మిల్ వర్కర్స్ అంబటి శ్రీనివాసరావు రాణి కొల్లాటి నాగలక్ష్మి పి కనకదుర్గ కే సత్యవతి తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి సిఐటియు బంటుమిల్లి మండల కన్వీనర్ మాజీ శివ శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కారం చేస్తామని అధికారంలో రాగానే మెనూ చార్జీలు వేతనాలు పెంచుతామని వాగ్దానం చేశారని కానీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మిడ్ డే మిల్లు వర్కర్లపై కక్ష సాధింపు అక్కడక్కడ చేస్తుందని ఈ విధమైన కక్ష సాధింపులు ఆపాలని ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం లో భాగంగా వర్కర్లకి కనీస వేతనం పదివేల రూపాయలు

# కొమ్మారెడ్డి స్కూల్ లో అంబేద్కర్ జయంతి



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి కొమ్మారెడ్డి స్కూల్ లో రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొమ్మారెడ్డి స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కిషోర్ గారు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాతగా స్వాతంత్రానంతర భారతదేశ పరిపాలనకు దిశా నిర్దేశం చేశారని, భారత పౌరులకు రాజ్యాంగం ద్వారా ప్రాథమిక హక్కులు మరియు బాధ్యతలు తెలియజేశారని, ప్రభుత్వానికి తాము చేయాల్సిన కార్యక్రమాల గురించి ఆదేశిక సూత్రాల ద్వారా తెలియజేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్లు కల్పించి వారి అభివృద్ధికి తోడ్పడ్డారని , భారతదేశ తొలి న్యాయశాఖ మంత్రిగా కూడా దేశానికి అనేక సేవలు అందించారని తెలియజేశారు. ఆయన రచించిన రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడడానికి ప్రతి భారత పౌరుడు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.యస్.వి.జి. శోభ , కొమ్మారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి చైతన్య , డైరెక్టర్ & వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హరణి , స్కూల్ హెచ్ఎం ఎన్. శ్రీనివాసరావు , ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కందుకూర్ ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు ఘన నివాళి



**కందుకూరు,కలంకౌంటర్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా కందుకూరు ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కందుకూరు ఖండ సంఘచాలక్ డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టిడ్కో ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఆర్ఎస్ఎస్ వారందరూ గణ వేషంలో వచ్చి అంబేద్కర్ కు నివాళులర్పించడం విశేషం.

# స్కందపురి సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**కందుకూరు,కలంకౌంటర్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా స్కంధపురి సేవా సమితిలి వారి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.దాతలు సంప్రదించవలసిన నెంబర్ : 9052667419

# అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించిన బండి




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** అంబేద్కర్ సర్కిల్లోని డాక్టర్ లిబాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించిన జనసేన పార్టీ ఇంచార్జ్ డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణలి ,జనసేన పార్టీ ముఖ్యులు .ఈసందర్భంగా బండిరామకృష్ణ మాట్లాడుతూ సమ సమాజ స్థాపనకు అంబేద్కర్ కృషి మరువలేనిదని అంటరానితనం పై వారు చేసిన పోరాటం తో పాటు ఓటు హక్కుప్రతి ఒక్కరికి కల్పించారని వారు చేసిన పోరాట ఫలితమేమనకు ఓటు హక్కు వచ్చిందని పేర్కొన్నారు ఓటు ద్వారా ప్రజలు ఎన్నుకున్న ప్రజాస్వామ్యం ఏర్పాటు జరుగుతుందని తెలిపారు . భారతదేశానికి అతి పెద్ద రాజ్యాంగం అందించిన మహానీయుడని అన్నారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గడ్డంరాజు,మహమ్మద్ సమీర్,కర్రీమహేష్,ఈవనమణిబాబు,మోకారవి,వడ్డీచిరంజీవి,కురుపయే-సు,జన్నునాగరాజు,పినిశెట్టివేణు,బండికరుణాకర్, త్రిపురారి తరుణ్,వేముల చక్రి, పెదసింగు చిరంజీవి, సంకులనాని,మంత్రిపృథ్వి, ఉడుముల బుజ్జి తోటయశ్వంత్, తోటభాస్కర్,బొమ్మసాని నరేష్,మురళి నరహరిశెట్టి రామ్ జ్యోతి ,బొద్దులపవన్,ప్రశాంత్,పలనియప్పరెడ్డికోటి, మహమ్మద్ భాషి,వంపుగడవల చరణ్,జన్ను వసంతరావు,ఏడుంబాకులవాసు,అరుణ్ తదితరులు పాల్గొన్నారు

# కూటమి ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు



**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవిలో కూటమి ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ విచ్చేసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ జయంతి వేడుకల కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, పూషడపు రత్నగోపాల్, సనకా ప్రశాంత్, మాజీ సీడీసీ చైర్మన్ రావి నాగేశ్వరరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావి రత్నగిరి, వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతా రామాంజనేయులు, మాజీ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, మండల కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, సొసైటీ చైర్మన్లు కోసూరు శివ నాగమల్లేశ్వరరావు, కోనేరు నాగేశ్వరరావు, బళ్ళ సీతారాం ప్రసాద్, నీటి సంఘం అధ్యక్షులు వేములపల్లి పిచ్చేశ్వరరావు, టౌన్ టీడీపీ అధ్యక్షులు జొన్నలగడ్డ రామకృష్ణ, సకాలేశ్వర స్వామి గవిరి శివరామకృష్ణ, డైరెక్టర్ బెల్లంకొండ ఏడుకొండలు, ఏఎంసీ డైరెక్టర్లు పుప్పాల ఏసు, మెరకనపల్లి నరేష్, నాయకులు మీసాల శివరాం, కొల్లి మురళీ, కేసాని శివుడు, కోసూరు శివాజీ, బాదర్ల లోలాక్షుడు, యడ్లపల్లి బుజ్జి, కోసూరు శివ నాగమల్లేశ్వర రావు, విస్సంశెట్టి రాజా, నాగినేని శేషగిరిరావు, దీవి యుగంధరి, మోటుపల్లి పండు, పీతా కనకయ్య, డోకిపర్తి బాల కోటేశ్వరరావు, మాతంగి జనార్ధనరావు, నందిగం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు నిస్వార్ధంగా కృషి చేద్దాం

-మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి. రాజేంద్రప్రసాద్





**ఉయ్యూరు,కలంకౌంటర్ :** రాజ్యాంగ నిర్మాత హింస అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ఐక్యతతో స్వార్ధంగా కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై వి బి రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా ఉయ్యూరు తెదేపా కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు జంపాన గురునాథరావు ఆధ్వర్యంలో మరియు ఉయ్యూరు మెయిన్ సెంటర్లో దళిత నాయకులు ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో పాల్గొని అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించిన అనంతరం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించిన అంబేద్కర్ ఆశయ సాధనకు మనమందరం కృషి చేద్దాం అని, ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు కూడా బడుగు, బలహీన వర్గాల ఆర్ధిక అభ్యున్నతికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, భారత దేశంలో రాజ్యంగా బద్ధ పదవులకు దళిత నాయకులకు సముచిత స్థానాన్ని కల్పిస్తున్నారని రాజేంద్రప్రసాద్ అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం , జనసేన పార్టీల నాయకులు,కార్యకర్తలు, మహిళలు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. కాగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రతి అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు .

# అసమానతలు తొలగించడానికి కృషి చేసిన మహానుభావుడు డా బి ఆర్ అంబేద్కర్ - రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఏ ఒక్క సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాదని, అందరికీ కావలసిన వ్యక్తిని సమాజంలో అసమానతలు తొలగించడానికి ఎంతగానో కృషి చేశారని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతినీ పురస్కరించుకుని తొలుత నగరంలోని లక్ష్మీ టాకీస్ సెంటర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి మంత్రికొల్లు రవీంద్ర,జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు లతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి విచ్చేసి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ చైర్మన్ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంబేద్కర్ ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాదనీ భారత దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికీ అంబేద్కర్ వారసులుగానే మనమందరం కూడా గుర్తుపెట్టుకోవాలన్నారు. ఈ స్థాయికి మనమందరం రాగలిగామంటే వారిచ్చినటువంటి భాగ్యమేనన్నారు.కొంతమంది ఆ రోజుల్లో జ్యోతిరావు పూలే సామాజిక అసమానతల మీద చేసినటువంటి పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని.అంబేద్కర్ కూడా అదే బాటలో నడిచి విద్య ద్వారానే అసమానతలు తొలగిపోతాయని ఉన్నతమైనటువంటి చదువులు చదువుకున్నారన్నారు. . ఆనాడు అనేక కష్టాలు అనుభవించి కూడా. మరి మనకు రాజ్యాంగం రాయడానికి ఆయన చాలా రాజ్యాంగాలను ఉపాసన పట్టారన్నారు. మన భారతదేశంలో విభిన్న కులాలు, మతాలు, సంస్కృతులు ఉన్నాయన్నారు. . వీటినన్నిటిని కూడా మేళవించి ఒక చక్కటి రాజ్యాంగం రాయడం వల్ల ఏలాంటి ఇబ్బందులు లేకుండా నిలకడగా ఉన్నామన్నారు. వారి ఆశయాలని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. . సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు కూడా మరొకరికి చేయి అందించివాళ్ళని ముందుకు తీసుకెళ్లాల్సినటువంటి అవసరం ఉందన్నారు. మచిలీపట్నంలో అంబేద్కర్ భవన్ నిర్మాణం చేయడానికి ప్రయత్నం చేసినప్పటికీ కొన్ని అనుకోని పరిస్థితులలో పనులు ఆగిపోయాయన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి బడ్జెట్లో నిధులు కేటాయించుకుని ఎంపీ, సి ఎస్ ఆర్ నిధులతో త్వరలో అంబేద్కర్ భవనం నిర్మాణ పనులు చేపడతామన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ. అంబేద్కర్ మన దేశానికి మాత్రమే ఒక మేధావి కాదు. ప్రపంచంలో మేధావులు ఎవరు ఉన్నారు అని పెద్ద యూనివర్సిటీలు సర్వే చేసిన దాంట్లో మొదటి స్థానంలో అంబేద్కర్ నిలిచారన్నారు. కొద్ది సంవత్సరాల క్రితం ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ గత 10 వేల సంవత్సరాల చరిత్ర తీసుకుంటే ప్రపంచానికి సేవలందించిన పెద్ద పెద్ద పండితులు 100 మంది మేకర్స్ ఆఫ్ యూనివర్స్ అని ఒక జాబితా తయారు చేస్తే దాంట్లో నాలుగో స్థానం అంబేద్కర్ కు ఇవ్వడం జరిగిందన్నారు. అంబేద్కర్ రచించిన ఒక పుస్తకం కొలంబియా యూనివర్సిటీలో ఒక పాఠ్యపుస్తకంగా ఈరోజు కూడా తరగతులు చేస్తున్నారంటే మనకెంతో గర్వకారణమన్నారు. ప్రపంచంలో ఉన్న ప్రతి మనిషినీ ప్రతి మేధావిని కూడా ప్రభావితం చేసే అంత గొప్ప వ్యక్తి అంబేద్కర్ అన్నారు..ఆయన ఆ స్థాయికి చదువు వల్లనే చేరుకోగలిగారన్నారు. ఆయన చదివినంత చదువు ఎవరూ కూడా భవిష్యత్తులోనూ చదవలేరు, గతంలోనూ ఎవరూ చదివి ఉండరని అనిపిస్తుందన్నారు ఒక్కసారి ప్రజాస్వామ్యం వచ్చి 75 సంవత్సరాల తర్వాత ఇటువంటి ఇబ్బంది లేకుండా కూడా కొనసాగుతుందంటే అందుకు కారణం మన రాజ్యాంగం ఎంతో పటిష్టమైన గొప్ప రాజ్యాంగం అన్నారు.ఆయన ఒక రాజకీయ నాయకులే కాకుండా ఆర్థికవేత్తగా కూడా వ్యవహరించారన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నెలకొల్పడానికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయనకు 64 శాస్త్రాల్లో నిపుణులని, 9 భాషల్లో పట్టు ఉందనీ. దాదాపు ప్రపంచంలో ఉన్న 21 ధర్మాల్ని ఆయన సరిపోల్చి లోతుగా అధ్యయనం చేశారన్నారు.

**రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ..** బాబాసాహెబ్ అంబేద్కర్ తన జీవితంలో అస్పృశ్యత, కుల వివక్షకు గురయ్యారన్నారు. మన జీవితాలలో అస్పృశ్యత అనేది లేకుండా అందరూ సమానంగా గౌరించబడేలాగా రాజ్యాంగాన్ని నిర్మించగలిగారన్నారు. చదువు ద్వారా అస్పృశ్యతను నిర్మూలించవచ్చనీ, ఉన్నత శిఖరాలకు చేరవచ్చనీ. నిమ్న కులములో పుట్టిన కూడా చదువుకోవడం వల్ల ఆయన రాజ్యాంగ నిర్మాణానికి సారధ్యం వహించారన్నారు. . ఆయన రాజ్యాంగంలో రాసినట్లు అస్పృశ్యత నిర్మూలన కోసం విద్య అనేదాన్ని తప్పనిసరి చేశారన్నారు. భారతదేశంలో పుట్టిన ప్రతి వ్యక్తి కూడా ఉచితంగా చదువుకోవాలనీ. ఒకవేళ చదువుకోవడానికి వాళ్ళు గనక ఇష్టపడకపోతే బలవంతంగానైనా చదివించాలనీ.రాజ్యాంగంలో ఉందన్నారు. . దాన్ని ఉపయోగించుకొని. అందరినీ విద్యావంతులుగా తయారు చేయాలన్నారు. . ఎక్కడ ఏ లోపాలు ఉన్నా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పార్లమెంటు సభ్యులు బాలసౌరి సహకారంతో బందరులో అంబేద్కర్ భవన నిర్మాణంత్వరలో చేపడుతామన్నారు.

**రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ..** అంబేద్కర్ తన జీవితంలో ఎన్ని ఇబ్బందులు పడ్డారని, ఎన్నో కష్టాలు పడి చదువుకున్నారని, ఆయన పడినటువంటి బాధలు, కష్టాలు ఈ సమాజంలో ఎవరూ పడకూడదనీ ఈ దేశం స్వేచ్ఛా వాయువులో ఎవరి హక్కులు వాళ్ళకు ఉండాలని చెప్పి భావించి ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగాన్ని ఈ దేశానికి అందించినటువంటి మహానుభావుడన్నారు. . అంతేకాకుండా ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా మనందరం కూడా మన హక్కులు, నిధులు, విధులు సక్రమంగా ఈ రోజున ఏ ఇబ్బందులు లేకుండా వెళ్తున్నామంటే దానికిడాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కారణమని చెప్పి వారి ఏ ఆశయంతో రాజ్యాంగ రచన చేశారో, ఈ సమాజంలో అందరూ సమానత్వంగా ఉండాలని, బడుగు బలహీన వర్గాలందరూ కూడా అన్ని రంగాల్లో కూడా ముందుకు వెళ్లాలని ఏదైతే భావించారో, దాన్ని ఆదర్శంగా తీసుకున్న మహానుభావుడు అన్న నందమూరి తారకరామారావు సమాజమే దేవాలయం ప్రజలే నా దేవుళ్ళు అనే నినాదంతో మరి ఆయన నేషనల్ ఫ్రంట్ చైర్మన్గా.ఉన్నప్పుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని పార్లమెంట్లో ఆవిష్కరించడం, భారతరత్న రావడం జరిగిందన్నారు. రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ రసరాజు రాసిన అద్భుతమైన పాట ..వెలివేసిన చీకటిలో వీధి దీపమా, విసిరేసిన శూన్యంలో ఇంద్రచాపమా....నీ చూపులు దేశానికి గొడుగులు. నీ అడుగులు వివక్షతకు పిడుగులు. అంటూ ఆలపించి అందరిని ఆకట్టుకున్నారు.

**మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ మాట్లాడుతూ..** మన దేశ రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతిని ఘనంగా జరుపుతున్నాం. ఒక వ్యక్తి మరణించిన తర్వాత కూడా ఆయన్ని స్మరించుకోవడం గౌరవించుకోవడం అంటే ఆ వ్యక్తి సమాజానికి, దేశానికి చేసినటువంటి మంచి ఆయన వల్ల ఈ దేశం ఎంత ముందుకు వెళ్ళిందో ఆయన్ని నిరంతరం కూడా మనం గుర్తు చేసుకోవడం మన కర్తవ్యం అన్నారు. నిజంగా కష్టపడి చదువుకొని ఒక ఉన్నత స్థాయికి చేరుకుని ప్రపంచంలోనే జనాభాపరంగా పెద్ద దేశం మరి భారతదేశం ఒక దేశం కాదు ఒక ఖండం అంటే వివిధ మతాలు, వివిధ సంస్కృతులు, వివిధ కులాలు, వివిధ జాతులు ఉన్నటువంటి దేశం. ఏ దేశానికైనా రాజ్యాంగం రాయటం సులభం. కానీ మన దేశానికి రాజ్యాంగం రాయటం అంటే ఆయన మరి ఎంత కష్టపడ్డాడో దేశం నలుమూలలా తిరిగి ఎక్కడ ఏ పరిస్థితులు ఉన్నాయో ఈ దేశంలో ఎవరు ఏమిటి? అలాగే ప్రపంచ దేశాల్లో ఉన్నటువంటి రాజ్యాంగం ఏంటి? దానివల్ల వాళ్ళు ఏ విధంగా లబ్ది పొందుతున్నారు? మనకు ఏ విధంగా కావాలని అన్వేషించి నిజంగా ఇన్ని విభిన్న మనస్తత్వాలు ఉన్నటువంటి భారతదేశాన్ని. ఒక్క తాటి మీద పెట్టగలిగిన వ్యక్తి అంటే అది అంబేద్కర్ కి సాధ్యమైందన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ఆనందకుమార్, రాష్ట్ర మైనార్టీ ఆర్థిక సంస్థ డైరెక్టర్ హసీం బేగ్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఫణి కుమార్, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే నాని , జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గుమ్మడి విద్యాసాగర్, అర్బన్ బ్యాంకు చైర్మన్ దిలీప్ కుమార్ విశ్రాంత లెక్చరర్ మేరీ కృప బాయి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, సిపిఎం నాయకులు కొడాలి శర్మ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆదినారాయణ , ఎస్సీ నాయకులు బాలాజీ, వేముల కోటేశ్వరరావు, తదితర అధికారులు అనధికారులు వివిధ సంఘాల నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మోపిదేవి గ్రామ పంచాయతీ వద్ద గ్రామసభ




**మోపిదేవి,కలంకౌంటర్ :** మండల కేంద్రమైన మోపిదేవిలో పంచాయతీ ప్రత్యేక అధికారి ముప్పిరిశెట్టి హరిహరనాధ్ అధ్యక్షతన గ్రామ-సభను నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ఆర్ గంగాధర్ ఆధ్వర్యంలో మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని గ్రామ సభను మోపిదేవి గ్రామ సచివాలయం - 1 వద్ద నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సభను ఉద్దేశించి హరిహరనాద్ ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు తమకు గల సమస్యలను ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. మంగళవారం, ఆదివారం రోజులలో మోపిదేవి ప్రధాన సెంటర్లో ఆర్టీసీ బస్సులు ఆపడం లేదనే విషయాన్ని భక్తులకు తెలిసే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ సభ్యులు కొమ్ము పవన్ కోరారు. మధ్యాహ్నం తరువాత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద బస్సులు ఆగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తమకు పంచాయితీ నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లులను ఇప్పించవలసినదిగా పారిశుధ్య కార్మికులు విజ్ఞప్తి చేశారు. గంజివానిపాలెం గ్రామం వద్ద బస్సులు ఆపడం లేదని ఆ గ్రామానికి చెందిన పంచాయతీ పాలకవర్గం మాజీ సభ్యురాలు బడుగు భారతి గ్రామ సభ దృష్టికి తీసుకువెళ్లారు. సంబంధిత సమస్యలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని ప్రత్యేక అధికారి హరిహరనాథ్ హామీ ఇచ్చారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి హరిహరనాద్, గంగాధర్, కొమ్ము పవన్ లతో పాటు పారిశుద్ధ్య కార్మికులు పూలమాలలతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మజ్జిగ పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఉదయపు నడక మిత్రమండలి ఆధ్వర్యంలో రెండవ రోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మజ్జిగదాత గుంట ముక్కల వీర బ్రహ్మం. ఈ కార్యక్రమం లో వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ కారుమూరి రాజేంద్రప్రసాద్,అధ్యక్షుడు జల్లు మురళి నాథ్ ఆధ్వర్యంలో కార్యదర్శి వేద లక్ష్మీనరసింహం ,ఉడత్తు సురేష్ కొండూరి భద్రం తదితర సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను మచిలీపట్నంలోని జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మరియు అంబేద్కర్ సర్కిల్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృష్ణా జిల్లా బిజెపి అధ్యక్షులు తాతినేని శ్రీరామ్ ముఖ్య అతిథిగా హాజరై, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యం:** ఈ సందర్భంగా తాతినేని శ్రీరామ్ మాట్లాడుతూ, అంబేద్కర్ చూపిన బాటలో నడుస్తూ ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎస్టీ మోర్చా అధ్యక్షులు



మద్దుల మధుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ముఖ్య నేతల సమక్షంలో..** ఈ కార్యక్రమంలో బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మరాజు గారు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం గజేంద్ర, జిల్లా జయంతి ఉత్సవాల కన్వీనర్ కురుమద్దాల ఫణికుమార్ , ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఏకుల విజయేంద్ర , జిల్లా ఉపాధ్యక్షులు మట్టా ఝాన్సీ , సోషల్ మీడియా కన్వీనర్ వి.వి. ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. ?జిల్లా మరియు మండల పదాధికారులు, ఎస్సీ, ఎస్టీ మోర్చా నాయకులు , బిజెపి కార్యకర్తలు భారీగా తరలివచ్చి బాబాసాహెబ్ కృషినీ, ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com